క్లుప్తంగా

స్వర్ణకారులను ఆదుకోవాలి



కమ్మర్‌పల్లి: కార్పొరేట్ జువెల్లరీ దుకాణాల వల్ల ఉపాధి కోల్పోతున్న తమకు ప్రభుత్వం చేయూతనిచ్చి, ఆదుకోవాలని కమ్మర్‌పల్లి మండల స్వర్ణకారులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం వారు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పుస్తెలు, మట్టెలు తదితర వివాహ సంబంధిత పనులు స్వర్ణకారులే చేసేవిధంగా, కార్పొరేట్, సాధారణ జువెల్లరీ దుకాణాల్లో ఈ ఆభరణాలు విక్రయించుకుండా ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. స్వర్ణకార వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. రాము, రవీందర్, అంకిత్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



పెర్కిట్(ఆర్మూర్): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో భార్గవి సూచించారు. మామిడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై ఆమె అవగాహన కల్పించారు. ఏసీడీపీవో ఆర్ జ్యోతి, సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ టీచర్లు గోదావరి పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు



నందిపేట్(ఆర్మూర్): ఓటరు నమోదు, సవరణలకు నందిపేట మండలంలో శనివారం ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు. నందిపేట మండలంలోని 44 పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్‌లెవల్ అధికారులు పర్యవేక్షణ చేశారు. కొత్త ఓటరు నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరించారు. సెప్టెంబర్ 19 వరకు పేర్లను నమోదు చేసుకోచ్చని, అక్టోబర్ 1న జాబితాను పరిశీలించి, 4న తుది జాబితాను విడుదల చేయడం జరుగుతుందని తహసీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతాం



బోధన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి అన్నారు. పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో శనివారం సంఘ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంజలి మాట్లాడుతూ.. ఈ నెల 5న సంఘం బోధన్ మండల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్త సమావేశానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మోహన్, క్రిష్ణ, ప్రశాంత్, హనుమంత్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

బోధన్: పట్టణంలోని నిజా షుగర్‌ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 29వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. బకాయి వేతనాలు చెల్లించే వరకు పోరాడుతామని కార్మిక సంఘ నాయకులు అన్నారు. కార్మికులు రమేష్, బాస్కర్, రఘునాథ్, నయీం, నాగేశ్వర్‌రావు తదితరులు కూర్చున్నారు.

పల్లెపల్లెకు కాంగ్రెస్



వేల్పూర్: మండలంలోని కొత్తపల్లి ఎస్, వాడి గ్రామాలలో శనివారం కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌కుమార్ 'పల్లె పల్లెకు కాంగ్రెస్, గుండె గుండెకు కాంగ్రెస్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను బీఆర్ఎస్ విస్మరించిందన్నారు. అవినీతి రహిత పాలన కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. నాయకులు గడ్డం నర్సారెడ్డి తదితరులున్నారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

నవీపేట: ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై యాదగిరి గౌడ్ హెచ్చరించారు. మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని నాళేశ్వర్, జన్నెపల్లి గ్రామాల నుంచి రాత్రి వేళల్లో ట్రాక్టర్లపై ఇసుక రవాణా అవుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే వాహనాలను సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నందిపేటలో కుక్కల స్వైర విహారం

- మూడు నెలల్లో 70మందికి గాయాలు
- భయాందోళనలో ప్రజలు



నందిపేటలో సంచరిస్తున్న కుక్కలు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో కుక్కలు గుంపులుగా సంచరిస్తుంటే ప్రజలు భయందోళనకు గురువుతున్నారు. పలు వీధుల్లో ప్రతినిత్యం పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. బస్టాండు సమీపంలో మెయిన్‌రోడ్డులో చికెన్, మటన్ సెంటర్ల నిర్వాహకులు మాంసం వ్యర్థ పదార్థాలు రోడ్డుపై పడవేయడంతో కుక్కలు ఆ ప్రాంతంలో ఎక్కువగా సంచరిస్తున్నాయి.

దీంతో బాటసారులు తీవ్ర భయానికి గురవుతున్నారు. నందిపేట్‌లో గత మూడు నెలలత్ల సుమారు 70 మందిపైగా చిన్నపిల్లలను, పెద్దలను కుక్కలు దాడి చేసి, గాయపరిచాయి. కుక్కల దాడి వల్ల ప్రతినిత్యం అనేకమంది ఆస్పత్రి పాలవుతున్నారు. అధికారులు మాత్రం పిచ్చికుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న ఫలితం మాత్రం కనిపించడం లేదు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి చిన్నపిల్లలపై దాడి జరుగకముందే వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'మేరీ మాటి–మేరా దేశ్'లో భాగస్వాములు కావాలి



మెండోరా మండలం దూదిగాంలో మట్టిని సేకరిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

బాల్కొండ: ప్రతిఒక్కరు 'మేరీ మాటి–మేరా దేశ్' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మెండోరా మండలం దూదిగాం , చాకిర్యాల్ గ్రామాల్లో శనివారం కార్యక్రమంలో భాగంగా వారు ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించారు. అనంతరం మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. మట్టిని ఢిల్లీలో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్మృతివనానికి పంపిస్తామన్నారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అలానే బీజేపీకి పట్టం కడుతారన్నారు. నాయకులు నిమ్మల శ్రీనివాస్, మోహన్, సాయన్న, సాయిరెడ్డి, ముత్యం, గంగారెడ్డి, నవీన్, అజయ్, సాయిరాం పాల్గొన్నారు.

డొంకేశ్వర్ మండలంలో..

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలకేంద్రంలో శనివారం బీజేపీ నాయకులు 'నా మట్టి–నా దేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని రామాలయంలో పూజలు నిర్వహించి ఇంటింటికీ తిరిగి మట్టిని సేకరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు సాగర్, శేఖర్, రామాగౌడ్ పాల్గొన్నారు.

ఏపీఎం, సీఏలను నియమించాలి



రెంజల్‌లో నిరసన తెలుపుతున్న మహిళలు

రెంజల్(బోధన్): ఏపీఎం, సీఏలను వెంటనే నియమించాలని డిమాండ్ చేస్తు మహిళలు శనివారం రెంజల్‌లోని ఐకేపీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సిబ్బంది లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడి పనిచేసిన ఏపీఎం చిన్నయ్య, సీసీ శ్యామలను జిల్లా అధికారులు బదిలీ చేశారని, అప్పటి నుంచి కొత్త వారిని నియమించడం లేదని వాపోయారు. జిల్లా అధికారులు మహిళా సంఘాలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకునాలని కోరారు. సర్పంచ్ మర్ల రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో సిబ్బందిపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయని ఆరోపించారు. అధికారులు ఇప్పటికైన ప్రక్షాళన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

దళితులను మోసం చేసిన సీఎం కేసీఆర్



ఆర్మూర్‌టౌన్: ఎన్నికల్లో గెలవగానే దళితుడుని సీఎం చేస్తా అని, మూడూ ఎకరాల స్థలం, దళితబంధు ఇస్తానని సీఎం కేసీఆర్ దళితులకు హామీ ఇచ్చి, మోసం చేశారని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దళితబంధును బీఆర్ఎస్ నాయకులు కమీషన్ బంధుగా మార్చారన్నారు. అర్హులైన దళితులకు దళితబంధు, 3 ఎకరాల స్థలం ఇవ్వాలన్నారు. నాయకులు ఉదయ్, సందీప్, నూతల శ్రీనివాస్‌రెడ్డి, జెస్సు అనిల్, పవర్ సాయినాథ్, దేవర్, సంజీవ్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు అండగా షీటీం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పెర్కిట్(ఆర్మూర్): పోకిరీలు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే షీటీంకు సమాచారం ఇవ్వాలని, విద్యార్థినులకు షీటీం అండగా ఉంటుందని కానిస్టేబుల్ విగ్నేష్ సూచించారు. మామిడిపల్లి బాలికల మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థినులకు శనివారం ఆయన షీటీం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. వేదింపులకు గురయ్యే విద్యార్థినులు, మహిళలు, ఉద్యోగినులు షీటీంకు సమాచారం అందజేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. బాధితులు 8712659795, డయల్ 100కు, షీటీం క్యూఆర్ కోడ్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం షీటీం కరపత్రాలను అందజేశారు. ప్రిన్సిపల్ నహీదా ఫిరోజ్, అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అందాపూర్ గ్రామంలో శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో శనివారం ఆలయ వ్యవస్థాపకుడు అగ్గు స్వామి ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజిత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదానం నిర్వహించారు. వివిధ గ్రామాల సర్పంచ్‌లు పుట్ట లక్ష్మీ శ్రీనివాస్, ఆసపురం దేవి, సట్లపల్లి సవిత, నీరడి రాజేశ్వర్, సింగిరెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

రుద్రూర్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని శనివారం బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు పత్తి లక్ష్మణ్, వివిధ గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాల తరగతులు..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇటీవల ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యాయి. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు ఇంగ్లీష్, తెలుగు మీడియంలో అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్బు చిరంజీవి తెలిపారు. మొదటి సంవత్సరం అడ్మిషన్ల స్వీకరణకు ఈనెల 16వరకు గడువు ఉందని తెలిపారు.

పశువులకు టీకాలు

రుద్రూర్: పోతంగల్ మండలం హెగ్డోలి గ్రామంలో శనివారం మండల పశువైద్యాధికారి సురేష్ కుమార్ పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. వెటర్నరి అసిస్టెంట్ సుధీర్, సిబ్బంది లక్ష్మీ, గోపాలమిత్రలు నగేశ్, రియాజ్, సాయిలు, పశుపెంపకందారులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్ల పంపిణీ

వేల్పూర్: మండలంలోని వాడి గ్రామంలో శనివారం పలువురు గొల్ల కుర్మలకు 12 గొర్రెల యూనిట్లను అధికారులు, నాయకులు పంపిణీ చేశారు. సర్పంచ్ గోపు మహేశ్, మండల పశువైద్యాధికారి సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం

కమ్మర్‌పల్లి: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ మద్దతు మంత్రి ప్రశాంత్‌రెడ్డికేనని తెలుపుతూ మండల కేంద్రంలోని మాదిగ సంఘం తీర్మానించారు. ఈమేరకు శనివారం సంఘ సభ్యులు సమావేశమై మంత్రికే ఓట్లు వేస్తామని తీర్మానం చేశారు.

సోయాలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



ఇత్వార్‌పేట్‌లో సోయాపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

బాల్కొండ/రెంజల్/పెర్కిట్(ఆర్మూర్): సోయా పంటలో సస్యరక్షణ చర్యలను రైతులు సకాలంలో చేపట్టాలని బాల్కొండ ఏవో మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోదేపల్లిలో శనివారం ఆయన సోయాబిన్ పంటలను పరిశీలించి, రైతులకు తగు సూచనలు చేశారు. పల్లాకు తెగులు సోకితే ఎసిఫేట్ 300 గ్రాములు లేదా ట్రై జోఫాస్ 400 మిల్లీలీటర్లు ఎకరానికి రెండు వందల లీటర్ల నీటిలో కలుపుకుని పిచికారి చేయాలన్నారు. తెగులు సోకిన మొక్కలను ఏరిపారేయలన్నారు. పేను నివారణకు అసిపెట్ 300 గ్రాములు లేదా డైమేథియేట్ 400 మిలీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి. లద్దెపురుగు నివారణ కోసం విషపు ఎరలను తయారు చేసి సాయంత్రం నాలుగు గంటల కు వర్షం లేని రోజు చల్లాలి. క్లోరీపైరిపాస్ 50 ఈసీ 500 ఎంఎల్, 10 కిలోల తవుడు, ఒక కిలో బెల్లం కలిపి విషపు ఎరలను తయారు చేయాలన్నారు. అలాగే రెంజల్ మండలంలో ఏఈవో ప్రసాద్, ఆలూర్ మండల కేంద్రంలో ఏవో హరికృష్ణ సోయాబీన్ పంటను పరిశీలించారు.

కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు



బోధన్‌లో చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బోధన్: బీఆర్ఎస్ ప్రభుత్వం కులమతాలు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందిస్తోందని బోధన్ ఎమ్మెల్యే షకీల్ పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకం (183 మంది) లబ్ధిదారులకు ఆయన రూ.1,83,21,228 విలువగల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు ఏ ఒక్కటి అమలు కావడం లేదన్నారు. కేసీఆర్‌ను విమర్శించే కాంగ్రెస్, బీజేపీ నాయకులు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన డబ్బులను పేదలకు పంచిపెట్టాలన్నారు. యువతీయువకులు ఉచిత వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం ఈ నెల 5నుంచి క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్, నాయకులు వీఆర్‌దేశాయ్, ఉద్మీర్ లక్ష్మణ్, రవీంద్రయాదవ్ పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ఆర్మూర్‌టౌన్: నకిలీ విత్తనాల ద్వారా నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. ఆర్మూర్ మండలంలోని పిప్రి, అమ్దాపూర్, మంథని, కమ్మర్‌పల్లి మండలంలోని హాసకొత్తూర్, ఉప్లూర్ గ్రామాల్లో కల్తీ విత్తనాలతో నష్టపోయిన సోయా పంటలను శనివారం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో పరిశీలించారు. అనంతరం ఆర్మూర్‌లోని కుమార్‌నారాయణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కల్తీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్ కేసులను నమోదు చేస్తామని చెబుతున్నా, నకిలీ కంపెనీల పేరుతో రైతులను నట్టేట ముంచుతున్నారన్నారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన లేకపోవడం ద్వారా కల్తీ విత్తనాలు విక్రయాలు పెరుగుతున్నాయన్నారు. సహకార సంఘాల ద్వారానే రైతులకు ఎరువులు, విత్తనాలను విక్రయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు దేవరాం, గంగారాం, సారా సురేష్, లింబాద్రి, నర్సయ్య, లింబన్న, రాజేశ్వర్, కిషన్, నరేందర్ పాల్గొన్నారు.

మహానేతకు ఘన నివాళులు



నందిపేటలో.. కాంగ్రెస్ నాయకులు



సాలూర క్యాంప్‌లో..



బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో..



మెండోరా మండల కేంద్రంలో..



సాలూర మండలంలోని సాలంపాడ్ క్యాంప్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

జిల్లాలో పలు చోట్ల దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులతో పాటు పలు పార్టీల నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ..రైతు శ్రేయస్సే లక్ష్యంగా వైఎస్ఆర్ పాలన సాగిందని, ప్రతి నాయకుడు ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



రుద్రూర్‌లో..



కోటగిరిలో ..

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పర్మినెంట్ చేయాలి



బోధన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల డిమాండ్ల సాధన కోసం ఈనెల 11 నుంచి సమ్మె తలపెట్టామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి సమ్మె నోటీసును వారు శనివారం పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసు వద్ద జూనియర్ అసిస్టెంట్ అర్జున్‌కు అందించారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, జంగం గంగాధర్, యేశాల గంగాధర్, మంగ, రాణి, లావణ్య, అనీసా, పద్మ, సునీత పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

- స్క్రీన్-1 – జైలర్ (తెలుగు)- 12.40, లవ్ ఆల్-(తెలుగు) - 4.05, బెదురులంక (తెలుగు)-7.00, 10.10
- స్క్రీన్-2 – ఖుషి (తెలుగు) - 11.45, 3.10, 6.35, 10.00
- స్క్రీన్-3 – బెదురులంక (తెలుగు) - 11.45, 2.55, ఖుషీ (తెలుగు) 6.05, 9.30
- స్క్రీన్-4 – జైలర్ (తెలుగు)- 11.30,2.55, 6.20, 9.45

సంక్షిప్తం

విద్యార్థులకు నోట్‌బుక్స్..

బోధన్: పట్టణంలోని నర్సాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శనివారం సొసైటీ ఫర్ ఆల్ ఇన్ నీడ్ సంస్థ ప్రతినిధులు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు శివరెడ్డి, ప్రకాష్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు సామగ్రి వితరణ

రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తిలోగల శ్రీ కేశవ శిశు విద్యామందిర్‌కు శనివారం రెంజల్ విండో మాజీ చైర్మన్ చీలం గోపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు రెండు పుస్తకాల ర్యాక్‌లు, రూ. 30వేల విలువగల సౌండ్ సిస్టంలను అందించారు. కుటుంబీకులు మోహన్‌రెడ్డి, నారాయణరెడ్డి, సుష్మితరెడ్డి, వికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో దంత వైద్యశిబిరం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాంమందిర్ పాఠశాలలో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో ప్రణతి డెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో దంత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు హనుమంత్‌రెడ్డి, ప్రణతిలు విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, టూత్‌బ్రష్‌లను, వివిధ రకాల మందులు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, నారాయణ, పుష్కరావు, రాజ్‌కుమార్, అగర్వాల్ పాల్గొన్నారు

ఆదిత్య ఎల్–1 సక్సెస్‌తో సంబురాలు

ఆర్మూర్‌టౌన్: ఇస్రో ప్రయోగించిన సోలార్ మిషన్ ఆదిత్య ఎల్–1 లాంచింగ్ విజయవంతం కావడంతో శనివారం పట్టణంలోని జెంటిల్ కిడ్స్‌ప్లే స్కూల్‌లో విద్యార్థులు సంబురాలు జరుపుకున్నారు. కరెస్పాండెంట్ ప్రకాష్ గుజరాతి, ప్రిన్సిపాల్ లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్‌గా మధు

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్ ప్రైమరీ పాఠశాల నూతన చైర్మన్‌గా కొత్త మధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రామ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సంఘ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

బాల్కొండ: మెండోరా మండలం సోన్‌పేట్‌లో గంగపుత్రసంఘం, దూదిగాంలో నాయకపోడు సంఘ భవనాల నిర్మాణానికి శనివారం ఎంపీపీ సుకన్య శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ తలారి గంగాధర్, డీసీసీబీ డైరెక్టర్ శేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు ప్రకాశ్, సుజాత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సొసైటీకి ఫ్రీజర్ బహూకరణ

కమ్మర్‌పల్లి: మండల ప్రజల సౌకార్యర్థం కమ్మర్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి శనివారం చైర్మన్ రేగుంట దేవేందర్ తన తండ్రి జ్ఞాపకార్థం ఫ్రీజర్‌ను బహూకరించారు. సీఈఓ శంకర్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎంఈవోకు సమగ్ర శిక్ష ఉద్యోగుల వినతి

బోధన్: జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రిలే నిరాహార దీక్షలకు వెళ్లెందుకు అనుమతి ఇవ్వాలని కోరుతు శనివారం బోధన్ మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు ఎంఈవో నాగనాథ్‌కు వినతిపత్రం అందించారు. సిబ్బంది పాల్గొన్నారు.

మధుశేఖర్‌కు ఘన స్వాగతం

ఆర్మూర్‌టౌన్/వేల్పూర్: ఇండియాన్ ఇన్‌స్టూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్ బాధ్యతలు స్వీకరించి, శనివారం మొదటిసారి ఆర్మూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే వేల్పూర్‌లో దివంగత వేముల సురేందర్‌రెడ్డి విగ్రహానికి మధుశేఖర్ నివాళులర్పించారు.